

రైతు భరోసా నమోదుకు అవకాశం

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన, రిజిస్ట్రేషన్ చేయించి ఇంతవరకు రైతుభరోసా జమ కాని రైతులకు నమోదుకు అవకాశం కల్పించినట్లు జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు వారి ఆధార్ కార్డు, 1బిలను రైతుభరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు అందించి పేర్లను నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. లబ్ధి పొందుతూ ఎవరైనా మృతి చెందితే, అటువంటి వారికి ఈ పథకం నిలుపుదల చేసి వారి నామినీ వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'సామూహిక ప్రవేశాలకు' సిద్ధమయ్యేనా?

- జిల్లాలో గృహ ప్రవేశాల లక్ష్యం 26,731 ఇళ్లు
- ఇప్పటివరకు పూర్తయినవి 23,568 గృహాలు
- ఈనెల 15లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశం
- గృహ ప్రవేశాలకు త్వరలో తేదీ నిర్ణయం

జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలకు ఇళ్లను సిద్ధం చేయాలని ప్రభుత్వం జిల్లా అధికారులను ఆదేశించింది. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని ఈనెల 15వ తేదీ లోగా పూర్తి చేయాలని సూచించింది. ఇళ్ల పూర్తి తర్వాత సామూహిక గృహ ప్రవేశాల తేదీని ప్రకటించనుందని తెలిసింది. ఇప్పటికే నాలుగు పర్యాయాలు వాయిదా పడడంతో ప్రభుత్వం విమర్శలపాలైంది. దీంతో ఇళ్ల పూర్తి తర్వాతే తేదీని నిర్ణయించాలని భావిస్తున్నట్లు తెలిసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు కాస్త వేగంగా సాగుతున్నా, అర్బన్ ప్రాంతాల ఇళ్ల నిర్మాణాల పరిస్థితి మాత్రం అధ్వానంగా ఉంది. మరోవైపు ఇళ్లు పూర్తవుతున్నా, పూర్తిస్థాయిలో తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించలేని పరిస్థితి కనిపిస్తోంది.

ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు (ఎన్‌పిఐ) పథకంలో భాగంగా 74,654 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో ఇప్పటివరకు 7,659 ఇళ్లు ప్రారంభం కాలేదు. వీటిలో బిబిఎల్ (బిలో బేస్‌మెంట్ లెవల్) దశలో 24,035 ఇళ్లు, పునాది దశలో 10,322 పైకప్పు దశలో 5,290 ఇళ్లు ఉన్నాయి. శ్లాబ్ పూర్తయినవి 3,790 ఇళ్లు ఉన్నాయి. ఇప్పటివరకు 23,568 ఇళ్లు పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగాయి. అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు చాలా మందకొడిగా ఉన్నాయి. ఆమదాలవలసలో 2,742 ఇళ్లు మంజూరు చేయగా పునాది, ఆ దశ



దాటినవి 860 ఇళ్లు (31.4 శాతం) ఉన్నాయి. శ్రీకాకుళం నగరం పరిధిలోని 11,272 మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించగా, పునాది దాటినవి 4,191 ఇళ్లు (37.2 శాతం) మాత్రమే ఉన్నాయి. ఇచ్ఛాపురం పట్టణంలోని 2,287 మంది పేదలకు ఇళ్లు కేటాయించగా పునాది, ఆ తర్వాత స్థాయి దాటినవి 993 ఇళ్లు (43.4 శాతం) ఉన్నాయి. అదేవిధంగా పలాస–కాశీబుగ్గ మున్సిపాల్టీ పరిధిలో 3,389 మందికి ఇళ్లు కేటాయించగా 1489 ఇళ్లు (43.9 శాతం) పునాది, ఆ తర్వాత దశ దాటి ఉన్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో కాస్త మెరుగ్గా నిర్మాణాలు

గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాల పరిస్థితి కొంత బాగానే ఉంది. జలుమూరు మండలానికి 1708 ఇళ్లు కేటాయించగా పునాది స్థాయి దాటినవి 1421 ఇళ్లు (83.2 శాతం) ఉన్నాయి. లావేరులో 2,644 ఇళ్లకు గానూ 2094 ఇళ్లు (79.2 శాతం) పునాది స్థాయి దాటి ఉన్నాయి. ఇచ్ఛాపురం మండలానికి 1261 ఇళ్లు కేటాయించగా 997 ఇళ్లు (79.1 శాతం) పునాది స్థాయి దాటి ఉన్నాయి. జి.సిగడాం మండలంలో 1471 మందికి ఇళ్లు ఇవ్వగా 1104 మంది (75.1 శాతం) ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసే పనిలో ఉన్నారు. మందసలో 74 శాతం, కంచిలిలో 73.6 శాతం, నరసన్నపేటలో 72.8 శాతం, సరుబుజ్జిలిలో 72.5 శాతం ఇళ్లు పునాది, ఆ తర్వాత స్థాయి దాటి నిర్మాణంలో ఉన్నాయి. మొత్తం మీద జిల్లాలో 16 మండలాల్లో ఇళ్ల నిర్మాణాల పరిస్థితి కొంత మెరుగ్గానే ఉంది.

లేఅవుట్లలో నామమాత్రంగా విద్యుత్ కనెక్షన్లు

జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనలోనూ వెనుకబాటు కనిపిస్తోంది. ప్రధానంగా తాగునీరు, విద్యుత్, రహదారుల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటివరకు 23,568 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటిలో సొంత స్థలాల్లో ఇళు నిర్మించుకుంటున్న వారు 20,152 మంది, జగనన్న లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకుంటున్న వారు 3,157 మంది ఉన్నారు. వీటిలో ఇప్పటివరకు 17,703 ఇళ్లకు (80.24 శాతం) విద్యుత్ సరఫరాను అందించగలిగారు. ఇందులో సొంత స్థలాల్లో నిర్మాణం చేపడుతున్న 17,703 ఇళ్లకు, లేఅవుట్లలో ఉన్న 1208 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. ఆమదాలవలస అర్బన్‌లో లేవుట్లలోని మూడు ఇళ్లకు మాత్రమే విద్యుత్ సరఫరా అందించగలిగారు. మందస, కవిటి ప్రాంతాల్లో చెరో ఐదు ఇళ్లకు, శ్రీకాకుళం అర్బన్, ఆమదాలవలస అర్బన్ ప్రాంతాల్లో చెరో ఆరు ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. ఇచ్ఛాపురం అర్బన్, పలాస ప్రాంతాల్లో చెరో ఏడు ఇళ్లకు విద్యుత్ సరఫరా అందించగలిగారు.

తాగునీటి సౌకర్యమూ అంతంతమాత్రమే

ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు అంతంతమాత్రంగానే తాగునీటి సౌకర్యం అందించారు. జిల్లాలో 23,568 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా, 18,663 ఇళ్లకు (79.19 శాతం) తాగునీటి కనెక్షన్లు ఇచ్చారు. వీటిలో లేఅవుట్లలో కేవలం 1068 ఇళ్లకు మాత్రమే తాగునీటిని అందించగలిగారు. మిగిలిన 16,328 కనెక్షన్లు సొంతంగా ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఇచ్చారు. ఆమదాలవలస అర్బన్, మందస, కవిటి లేఅవుట్లలో ఐదేసి ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. శ్రీకాకుళం అర్బన్‌లో ఆరు ఇళ్లకు, ఇచ్ఛాపురం అర్బన్‌లో ఎనిమిది ఇళ్లకు, పలాసలో తొమ్మిది ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చారు.

15 నాటికి గృహాలను సిద్ధం చేస్తున్నాం

జగనన్న లేఅవుట్లలో ఈనెల 15వ తేదీ నాటికి నిర్దేశించిన గృహాలను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇళ్ల నిర్మాణాల పూర్తి తర్వాత సామూహిక గృహ ప్రవేశాల తేదీని ప్రభుత్వం నిర్ణయించవచ్చు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేందుకు అవసరమైన చర్యలను చేపడుతున్నాం. సిబ్బందితో వీడియో, టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రాధాన్యతను తెలియజేస్తున్నాం.

– ఎన్.గణపతి,
పథక సంచాలకులు, గృహనిర్మాణ శాఖ

ఎకరాకు రూ.25 లక్షలు ఇస్తాం

- గ్రామసభలో సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి
- పోర్టు అనుసంధాన రోడ్డుకు పరిహారం ప్రకటన



సబ్ కలెక్టర్‌కు అభిప్రాయాను తెలియజేస్తున్న రైతులు

ప్రజాశక్తి – నౌపడ

భావనపాడు పోర్టు అనుసంధాన రోడ్డుకు భూములు ఇచ్చే రైతులకు ఎకరాకు రూ.25 లక్షల పరిహారాన్ని సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ప్రకటించారు. పోర్టు నిర్మాణ ప్రాంతం నుంచి 16వ జాతీయ రహదారిని అనుసంధానం చేసే స్పీడ్ యాక్సిస్ రోడ్డు భూసేకరణకు నౌపడ సచివాలయం వద్ద ప్రో డిప్యూటీ కలెక్టర్ అంబ్లిష్ ఆధ్వర్యాన రైతులతో గ్రామసభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నౌపడ రైతులు ఆర్ అండ్ ఆర్ కాలనీకి చేసిన 60 ఎకరాలను ఇచ్చినట్లే రహదారి నిర్మాణానికి భూములు ఇవ్వాలని కోరారు. దీనికి గ్రామంలో మరో 70 మంది రైతుల నుంచి రోడ్డు నిర్మాణానికి భూములు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆర్ అండ్ ఆర్ కాలనీకి ఇచ్చిన ధర కాకుండా రోడ్డు నిర్మాణానికి రూ.నాలుగు లక్షలు తక్కువ ధర ఇస్తామని చెప్పడంతో రైతులందరూ తిరస్కరించారు. ఎన్నో ఏళ్లుగా ఆధారపడి బతుకుతున్న భూములు కోల్పోతామని నష్టపరిహారం సరిపోదని వాపోయారు. ప్రస్తుతం ఎకరా రూ.కోటి వరకు పలుకుతుందని, ప్రభుత్వం ఇచ్చే పరిహారం తమకు సరిపోదని వివరించారు. అభివృద్ధికి భూములు కావాలంటే మా భూములు తీసుకుని దానికి బదులుగా ధర పలికే భూములు ఇవ్వాలని వాదించారు. గ్రామానికి చెందిన కనిరెడ్డి భాస్కర్ రెడ్డి తనకున్న ఎనిమిది ఎకరాలు మూలపేట ఆర్ అండ్ ఆర్ కాలనీకి, రోడ్డు నిర్మాణానికి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూమి తీసుకుంటే సర్వస్వం కోల్పోతామని తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. మరో రైతు లోపింటి జయకృష్ణారెడ్డి తనకున్న ఎకరాన్నర భూమిలో ఏడు సెంట్లు త్రిభుజాకారంలో మిగులుతుందని, దాన్ని మేమేం చేసుకుంటామని ప్రశ్నించారు. చతురస్రాకారంలో భూసేకరణ చేస్తే మిగులు భూమి ఉపయోగపడుతుందని అభిప్రాయం తెలిపారు. గ్రామసభకు రెవెన్యూ అధికారులు నోటిఫికేషన్‌లో ఉన్న రైతులకు సమాచారం ఇవ్వకపోవడంపై పలువురు రైతులు అధికారులను ప్రశ్నించారు. రైతుల అభిప్రాయాల అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం తొలుత ప్రకటించిన పరిహారాన్ని రెండింతలు చేసి రూ.22.50 లక్షలు ఇస్తామని ప్రకటించారు.

దీన్ని తిరస్కరించిన రైతులు ఎకరాకు రూ.40 లక్షలు కావాలని డిమాండ్ చేశారు. చివరకు ఎకరాకు రూ.25 లక్షలు చెల్లిస్తామని, అంతకుమించి పరిహారం పెంచలేమని సబ్ కలెక్టర్ స్పష్టం చేశారు. దీనికి పలువురు రైతుల అంగీకరించారు. వారం రోజుల్లో రైతులు భూములు అప్పగిస్తూ పత్రాలు సమర్పించాలని చెప్పి సభను ముగించారు. కార్యక్రమంలో తహశీల్దార్ చలమయ్య, రెవెన్యూ అధికారులు చంద్రమౌళి, సర్వేయర్ బాలరెడ్డి, నౌపడ సర్పంచి ప్రతినిధి పిలక రవికుమార్ రెడ్డి, ఎంపిటిసి ప్రతినిధులు లోపింటి రాములు, బి.సుధాకర్, మూలపేట సర్పంచ్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు నిరసన సెగ

రేఖపల్లి రోడ్డులో నిలదీసిన గిరిజనులు



రేఖపల్లి రోడ్డులో ఎమ్మెల్యే ధనలక్ష్మిని అడ్డగించిన గిరిజనులు

ప్రజాశక్తి – వి.ఆర్ పురం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిను గిరిజన సంఘం, ఆదివాసీ జెఎసిల ఆధ్వర్యంలో గురువారం గిరిజనులు, గిరిజన ప్రజాప్రతినిధులు అడ్డుకున్నారు. మండల కేంద్రమైన రేఖపల్లిలో ఆసరా పథకంపై తలపెట్టిన ఓ కార్యక్రమానికి ఎమ్మెల్యే ధనలక్ష్మి వచ్చారు. ఆమెను ప్రధాన కూడలి వద్ద గిరిజనులు అడ్డగించి 'ఎమ్మెల్యే గో బ్యాక్' అంటూ పెద్దపెట్టున నినదించారు. బోయ/వాల్మీకిలను, బెంతో ఒరియాలను ఎస్‌టి జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయంపై మీతో సహా ఏడుగురు గిరిజన ఎమ్మెల్యేలూ ఇంత వరకూ ఎందుకు స్పందించలేదంటూ నిలదీశారు. ఇతరులను ఎస్‌టి జాబితాలో చేర్చితే నిజమైన గిరిజనులు విద్య, ఉపాధి సహా అన్నింటా అన్యాయానికి గురవుతారన్నారు. గిరిజనుల ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వకుండానే అక్కడి నుంచి ఎమ్మెల్యే జారుకున్నారు. అనంతరం రేఖపల్లి కూడలిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపిపి కారం లక్ష్మి, జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి, గిరిజన సంఘం నాయకులు పులి సంతోష్ కుమార్, ఎంపిటిసి పూనం ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ గిరిజన ఎమ్మెల్యేలు వెంటనే రాజీనామా చేయాలన్నారు. బోయ వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ చేసిన తీర్మానాన్ని రద్దు చేసేవరకూ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా తీర్మానం చేస్తున్నప్పుడు గిరిజన ఎమ్మెల్యేలు ఎందుకు నోరుమెదపలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ప్రజా ప్రతినిధులు పి.సరోజిని, కారం బుచ్చమ్మ, సవలం మారయ్య, వేటి లక్ష్మి, పాయం లక్ష్మణరావు, కారం సుందరయ్య, పొడియం శ్రీరామూర్తి, చిక్కాల రామారావు, వాళ్ల వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

ఇంటి వద్దకే 'ఫ్యామిలీ డాక్టర్'

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి – ఆమదాలవలస

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గడప వద్దకే వైద్య సేవలు అందించనున్నట్లు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కనుగులవలసలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని, సచివాలయం వద్ద విలేజ్ హెల్త్ క్లినిక్ కార్యాలయాన్ని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారని తెలిపారు. గతంలో వ్యయ ప్రయాసలకు గురై వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేదని, నేడు ప్రజల ఇంటి దగ్గరకే వైద్య సేవలను తీసుకొచ్చారని చెప్పారు. నెలలో ఒక గ్రామ పరిధిలో రెండుసార్లు సందర్శించి, ప్రతి ఇంటికీ వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. నాలుగేళ్లలో సుమారు 50 వేల వైద్య సిబ్బందిని ప్రభుత్వం నియమించిందని, వైద్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత ఏమిటో అందరూ గుర్తెరగాలని కోరారు. వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. గత ప్రభుత్వం ప్రజల వద్దకు పాలన అనేదని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల చెంతకు పాలనను తీసుకొచ్చి సంక్షేమ పథకాలు, వినూత్న కార్యక్రమాల ద్వారా పాలనను కొత్త పుంతలు తొక్కిస్తున్నారని చెప్పారు. గతేడాది అక్టోబరు 21వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ట్రయల్ రన్ నిర్వహించారని, అది విజయవంతమైందన్నారు.

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ కరోనా కాలం నుంచి చాలా పాఠాలు నేర్చుకున్నామని, దాని ఫలితమే రెండు వేల జనాభాకు ఒక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వైద్య సిబ్బందిని నియమించి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్య సేవలు అందించడమే ఈ పథకం ఉద్దేశమని తెలిపారు. అనంతరం 104 మొబైల్ వాహనాన్ని పరిశీలించి సామగ్రి, మందుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్పీకర్ బిపి పరీక్షను చేయించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపిపి తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి సభ్యులు బెండి గోవిందరావు, వైస్ ఎంపిపి ఎం.వెంకటరమణ, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, తహశీల్దార్ ఎస్.గణపతి, మండల సచివాలయ కోఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్ణయమే శిరోధార్యం

ప్రజాశక్తి – శ్రీకాకుళం

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు నిర్ణయమే తమకు శిరోధార్యమని మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నాయకులు గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి దంపతులు తెలిపారు. నగరంలోని అరసవల్లిలో వారి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయ పార్టీల్లో సిద్ధాంత ప్రాతిపదికగా ముందుకుపోవాలి గానీ గ్రూపులతో కాదన్నారు. యువతకు 40 శాతం టిక్కెట్లు ఇస్తామని పార్టీ విధానాన్ని ప్రకటించిందని తెలిపారు. 40 శాతం టిక్కెట్లు యువతకు ఇస్తే, మిగిలిన 60 శాతం మహిళలు, రాజకీయాల్లో అనుభవం ఉన్న వారికి ఇవ్వాలని తాను చంద్రబాబు నాయుడుకు చెప్పానన్నారు. మహిళలకు ఎక్కడ ఇవ్వాలి, యువతకు ఎక్కడ ఇవ్వాలి, అనుభవం ఉన్న రాజకీయ నాయకులకు ఎక్కడ ఇవ్వాలన్న విషయంలో ఆయన అందుకనుగుణంగా నిర్ణయం తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. అటువంటి సందర్భంలో చంద్రబాబునాయుడు ఏం నిర్దేశిస్తే దానికి కట్టుబడి అందరం కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీకి నష్టం కలిగించే వాళ్లు ఎవరైనా, ఏ ముసుగులో ప్రయత్నాలు చేసినా కచ్చితంగా చర్యలు తీసుకుంటానని చెప్పారని తెలిపారు. అధినాయకుని ఆదేశాలకు అందరూ కట్టుబడి ఉండాలని, ఇప్పటికైనా కలసికట్టుగా పనిచేసి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు.

రెండు పూటలూ పని చేయండి

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు



కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

ప్రజాశక్తి – లావేరు

పని ప్రదేశాల్లో కూలీలు రెండు పూటలు పనులు చేసి, రూ.272 గరిష్ట వేతనాన్ని పొందాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జివి చిట్టిరాజు ఉపాధి హామీ కూలీలను కోరారు. గురువారం లావేరు పంచాయతీలో జరుగుతున్న అమృత్ సరోవర్ చెరువు అభివృద్ధి పనులను పీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం 6గంటల సమయం ఉపాధి పనులు చేస్తే గరిష్టవేతనం పొందడంతో పాటు మీ గ్రామాల్లో సుస్థిర వనరులు ఏర్పడతాయన్నారు. ఉపాధి పనులను మీ సొంత పనుల్లా భావించి చేపట్టాలన్నారు. కూలీలకు కొలతలపై అవగాహన కలిగించాలని సిబ్బందికి సూచించారు. క్షేత్రస్థాయిలో పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని, పారదర్శకంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేదిలేదన్నారు. ప్రతి మండలంలోనూ నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎం.రవికుమార్, ఎపిఒ సత్యవతి, ఇతర ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

ఆ స్థలం అమ్మేందుకు హక్కు లేదు

- సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి
- వివాదాస్పద స్థలంపై విచారణ



విచారణకు హాజరైన స్వర్ణకారులు

ప్రజాశక్తి – టెక్కలి

టెక్కలి పాలశీతలీకరణ కేంద్రానికి ఎదురుగా ఉన్న జగద్ధాత్రి స్వర్ణకారుల సంఘ స్థలం ఇప్పటివరకు ప్రభుత్వ ఆధీనంలోనే ఉందని, ఆ స్థలాన్ని అమ్మేందుకు స్వర్ణకారులకు, కొనేందుకు ఇతర వ్యక్తులకు ఎటువంటి హక్కులు లేవని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం తన కార్యాలయంలో వివాదాస్పద స్థలంపై విచారణ చేపట్టారు. ఇరు గ్రూపుల వాదనలను సబ్ కలెక్టర్ విన్నారు. స్వర్ణకారుల సంఘం సభ్యులు ఆ స్థలం తనకు విక్రయించారని, ఈ స్థలం తన ఆదీనంలో ఉందని బలగ ప్రకాష్ ఆ స్థలంలో కొద్ది రోజుల క్రితం బోర్డును ఏర్పాటు చేశారు. స్వర్ణకారుల సంఘంలోని కొందరు సభ్యులు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి దృష్టికి తెచ్చారు. రెండు ఎకరాల స్థలంకు తామే హక్కుదారులమని సంఘంలోని లక్కోజు విఠలేశ్వరరావు, కంచుమొజు మల్లి అమ్మాజీరావు, తదితరులు బలగ ప్రకాశ్‌కు స్థలం విక్రయించినట్లు తెలిపారు. అయితే స్వర్ణకారుల సంఘం తమదే ఆ స్థలమని, ఎవరికీ స్థలం విక్రయించలేదని చెబుతోంది. ఇరువురి వాదనలు విన్న సబ్ కలెక్టర్ పై విధంగా స్పందించారు. లిక్విడేటర్ రావణబ్రహ్మ పేరుతో ఉన్న దృష్ట్యా ఇది ప్రభుత్వ స్థలంగానైనా భావించాలని, లేదా స్వర్ణకారుల సంఘ స్థలంగా నైనా భావించాలని, ఈ స్థలంలో ఎవరూ నిర్మాణాలు చేయడానికి వీల్లేదని సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఈ చర్చల్లో తహశీల్దార్ కిషోర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫీవర్ కేసులపై ప్రత్యేక దృష్టి

- ప్రయివేటు ఆస్పత్రులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి
- అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవు
- డిఎంఅండ్‌హెచ్‌ఒ బి.మీనాక్షి

ప్రజాశక్తి – శ్రీకాకుళం

ఫీవర్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి ఆదేశించారు. నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయివేటు ఆస్పత్రులకు వచ్చే కేసులకు సంబంధించి డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి వాటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఒక గ్రామం నుంచి ఎన్ని కేసులు వస్తున్నాయో గుర్తించాలన్నారు. ప్రతి నెల 28వ తేదీ లోగా ఆయా ఆస్పత్రుల్లో నమోదు చేసిన వివరాలను ప్రభుత్వ వైద్యశాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఫీవర్ కేసుల నమోదు విషయంలో ఎవరైనా అశ్రద్ధ చూపితే ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనురాధ మాట్లాడుతూ పిసిపిఎన్‌డిటి యాక్ట్ ఫారం–ఎఫ్‌ను జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయానికి 25వ తేదీలోగా తప్పనిసరిగా పంపించాలన్నారు. రానున్న రోజుల్లో మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐటి మేనేజర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని ప్రయివేటు ఆస్పత్రుల నుంచి వివరాలు రావడం లేదని తెలిపారు. ఫీవర్ కేసు నమోదుకు సంబంధించి పి ఫారం, ఐ ఫారంలో నమోదు చేయాలన్నారు. apsrkdsu@yaho.co.in వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. సందేహాల నివృత్తికి 8639074149, 9491764543 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణ గురించి రోలోట్ మేనేజర్ రవికిరణ్ వివరించారు. సమావేశంలో డాక్టర్ చంద్రనాయక్, అమ్మన్నాయుడు, మందుల మోహనరావు, తిరుపతిరావు, డిఐఒ ఆర్.వి కుమార్, జె.కృష్ణమోహన్, చింతాడ కృష్ణమోహన్, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, డిఎంఒ సత్యనారాయణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ మీనాక్షి

ట్రాక్టర్ డ్రైవర్ల ధర్నా



ట్రాక్టర్ డ్రైవర్లతో మాట్లాడుతున్న దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి – టెక్కలి

ట్రాక్టర్లపై భూగర్భ గనులశాఖ ఆధ్వర్యాన పన్నులు వేయడాన్ని నిరసిస్తూ ట్రాక్టర్ డ్రైవర్లు ధర్నా చేపట్టారు. ట్రాక్టర్స్ యజమానుల సంఘం ఆధ్వర్యాన గురువారం విశ్వసముద్రం కార్యాలయం ముందు ట్రాక్టర్లు నిలిపివేసి, ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ భూగర్భ గనులశాఖ ఆధ్వర్యంలో గతంలో తాము ఎప్పుడూ పన్నులు చెల్లించలేదని, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల విశ్వ సముద్రం ప్రయివేట్ సంస్థ ఆధ్వర్యంలో ట్రాక్టర్‌లపై పన్నులు విధిస్తున్నారని అన్నారు. ట్రాక్టర్ మట్టి లోడుకు రూ.320, కంకర, చిప్స్ లోడుకు రూ.630 విధిస్తున్నారని అన్నారు. దీని వల్ల యజమానులు, గృహ నిర్మాణదారులకు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. ఈ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను కలిసి సమస్య వివరించారు. దువ్వాడ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై చర్చిస్తానని, కొద్ది రోజుల వరకు పన్నులు వసూళ్ల కాకుండా చూడాలని సంబంధిత అధికారుల దృష్టిలో పెడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 500 మంది ట్రాక్టర్ డ్రైవర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొల్లి ఎల్లయ్య, ట్రాక్టర్ల యజమానులు నవీన్, శంకర్, తిర్లంగి కృష్ణ, అప్పన్న, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలపై డిఆర్‌ఎంకు వినతి



డిఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి – ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలు, ఎల్‌సి గేటు వద్ద అండర్ పాస్‌వే నిర్మాణంపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ సీడాప్ ఎపి చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఈస్టుకోస్టు రైల్వే సలహా సంఘ సభ్యులు కట్టా సూర్యప్రకాష్‌రావు డిఆర్‌ఎం రింకేస్ రాయ్‌కు వినతిపత్రం అందజేశారు. గురువారం ఒడిశాలోని ఖుర్దాలో డివిజనల్ రైల్వే మేనేజర్‌ను కలిసి ఇక్కడ నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రైల్వే గేటు వద్ద అండర్ పాస్‌వే నిర్మాణానికి సానుకూలంగా ఉన్నారని, రెండు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో ప్రక్రియ చేపడతామని హామీ ఇచ్చినట్లు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇచ్ఛాపురం నుంచి విశాఖకు వెళ్లేందుకు రైళ్ల నిలుపుదల చేయాలని, పలాస–విశాఖ డిఎంయును ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని కోరారు. వారితో పాటు సీనియర్ రైల్వే అధికారులు రవిప్రకాశ్ యాదవ్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు వరం.. ఇంటింటి వైద్యం

మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న ఇంటింటి వైద్యం రోగులకు వరం వంటిదని, దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. గురువారం ప్రగతి భవన్ ఆవరణలో ఫ్యామిలీ డాక్టర్ వాహనాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 104 సేవలే పేరు మార్చి కొత్త పథకాన్ని వైసిపి ప్రవేశపెట్టిందని మాజీ మంత్రి కళా వెంకటరావు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆయనకు ఈ పథకంపై అవగాహన లేదని ఆరోపించారు. టిడిపి నాయకులకు అవగాహన కల్పించేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఎంపిపిలు ఉంగ ప్రవీణ, డొక్కరి దానయ్య, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉంగ సాయికృష్ణ, పలాస పట్టణ అధ్యక్షులు సనపల సింహాచలం, వైద్యులు సునీల్‌కుమార్, ప్రశాంతి, దివ్య, రవికుమార్ దొర, సంపతిరావు, ప్రత్యూష, కృష్ణ, జె.సాయి పాల్గొన్నారు.

పోలాకి : పేదలకు సత్వర వైద్యం అందించేందుకు ప్రారంభమైన ఫ్యామిలీ డాక్టర్ ఓ మహత్తర కార్యక్రమమని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. గురువారం మబగాంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ, అంబులెన్స్ సేవలూ ఉన్నాయని, కానీ వైద్య, ఆరోగ్య సేవలు రాష్ట్రంలోని నలుమూలలకు అందట్లేదనే కొరత తీర్చడానికే సిఎం జగన్ దీనికి రూపకల్పన చేశారన్నారు. పల్లెలు, ఏజెన్సీల వంటి ప్రాంతాల్లో ఇప్పటికీ సరైన వైద్య సదుపాయాలు లేవని, అందుకే స్పెషలిస్టు డాక్టర్ల సేవలను నేరుగా రాష్ట్రం నలుమూలలకూ విస్తరించే, అందించే ఉద్దేశంతో తెచ్చినదే 'ఫ్యామిలీ డాక్టర్' కాన్సెప్ట్ అని అన్నారు. ఈ నెలకు రెండు సార్లు గ్రామాల్లో డాక్టర్లు పర్యటించి ప్రజల



పలాస : వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అప్పలరాజు

ఆరోగ్యాన్ని తెలుసుకుంటారన్నారు. గ్రామాల్లో 104 అంబులెన్సులు నిరంతరం అందుబాటులో ఉంటాయని ఆయన చెప్పారు. చెప్పారు.

ఇచ్ఛాపురం: 'ఫ్యామిలీ డాక్టరు'తో ఇంటి వద్దకే వైద్యం అందుతుందని ఎంపిపి బోర పుష్ప అన్నారు. మండలంలోని బిర్లంగ గ్రామ పంచాయతీలో ఫ్యామిలీ డాక్టరు వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం జగనన్న మా భవిష్యత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, డాక్టర్ వెచ్చా సంతోష్, వైసిపి నాయకులు కె.మోహన్‌రావు, నూకయ్యరెడ్డి, కె.త్రినాథ్, చిట్టిబాబు, వైసిపి నాయకులు కె.మోహన్‌రావు, నూకయ్యరెడ్డి, కె.త్రినాథ్, చిట్టి బాబు, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: ఇంటింటికీ వైద్యం అందివ్వాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకువచ్చిందని టెక్కలి జెడ్‌పిటిసి



సోంపేట : మాట్లాడుతున్న ఎంపిపి దాసు

దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని లింగాలవలస గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి ఆట్ల సరోజనమ్మ, ఉపాధ్యక్షులు సంపతరావు రమేష్, సంపతరావు రాఘవరావు, కె.కొత్తూరు వైద్యాధికారి భాగ్యశ్రీ, గాయత్రి, నీరజ, భాగ్య, ఎఎన్ఎంలు అనురాధ, రోహిణి, మల్లేశ్వరి, గజలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగించుకోవాలని ఎంపిపి నిమ్మన దాస్ అన్నారు. సోంపేట ఆరోగ్య ఉపకేంద్రం వద్ద గురువారం లాంఛనంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నగిరి ప్రభావతి, జెడ్‌పిటిసి తడక యశోద, కొర్లం పిహెచ్‌సి వైద్యులు నందిత, నాయకులు మల్ల వెంకటరమణ, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బూర్జ : మండలంలోని అప్పలపేట గ్రామ సచివాలయంలో ప్రతి ఇంటికీ ఫ్యామిలీ వైద్యం అందించేందుకే ప్రభుత్వం ఫ్యామిలీ వైద్యం పథకాలు అమలు చేశారని ఎంపిపి కె.దీప అన్నారు. ఈ మేరకు ప్రభుత్వం సరఫరా చేసిన వాహనాన్ని ప్రారంభించారు. మండలంలోని ఇంటింటికీ వైద్యం అందించేందుకు ప్రభుత్వం పూర్తి చర్యలు చేపట్టిందన్నారు. ఏ ఒక్క రాగమొచ్చినా పట్టణాల వైపు చూడాల్సిన అవసరం లేదన్నారు. 24 గంటలు విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా వైద్యం అందించేందుకు అన్నివిధాలుగా చర్యలు చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బూర్జ పిహెచ్‌సి వైద్యాధికారులు పావని, రాజశేఖర్, డిసిఎంఎస్ మెంబరు జల్లు బలరాంనాయుడు, ఫైలెట్ అసిరినాయుడు, మహేష్, కేశవరం పాల్గొన్నారు.

పొందూరు: గ్రామాల్లో ఇంటి వద్దకే వైద్య సేవలను తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపిపి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావులు అన్నారు. మండలంలోని బురిడికంచరాం, కృష్ణాపురం గ్రామాల్లో 104 వాహనంతో పాటు, ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామాల్లో మంచం పట్టిన రోగులకు ఇంటివద్ద వైద్యులు అందిస్తున్న సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, సర్పంచ్ ప్రతినిధిలు గంట్యాడ రమేష్, అంబళ్ల శ్రీను, ఎంపిటిసిలు బొత్స రమణ, కొన్న రమణ పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : వైద్య సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైసిపి మండలం మహిళా అధ్యక్షులు గురాన మానస అన్నారు. మండలంలోని వల్లభరావుపేటలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మహంతి సత్యనారాయణ, రావాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సుమన్, ఇఒ మూర్తి, హెచ్‌వి పాల్గొన్నారు.



పోలాకి : వైద్యసేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్



పొందూరు : 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు



ఇచ్ఛాపురం : వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి పుష్ప



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి- టెక్కలి

గర్భిణికి వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించిన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. వైద్యం నిమిత్తం ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యం అందించే క్రమంలో బాధ్యతగా మేలగాలని అన్నారు. గురువారం సాయంత్రం తన ఛాంబర్‌లో రెండో రోజు ఆస్పత్రి సిబ్బంది పనితీరుపై విచారణ చేపట్టారు. మందస మండలం హోన్నాలి గ్రామానికి చెందిన ఎఎన్ఎం, ఆశా కార్యకర్త, హరిపురం పిహెచ్‌సి వైద్యులు, టెక్కలి జిల్లా ఆస్పత్రి సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ నెల 2వ తేదీన గర్భిణికి చికిత్స అందించే క్రమంలో జరిగిన లోటుపాట్లపై విచారణ చేపట్టారు. ఇందుకు సంబంధించిన టెక్కలి జిల్లా ఆస్పత్రి నర్సింగ్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ సూర్యారావును ఆదేశించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు.



నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

రెవెన్యూ ఉద్యోగుల నిరసన

శ్రీకాకుళం అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రెవెన్యూ ఉద్యోగుల సంఘం యూనిట్ అధ్యక్షులు సోనీ కిరణ్ డిమాండ్ చేశారు. అమరావతి జెఎసి పిలుపు మేరకు రెండో దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా గురువారం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం ఎదుట రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు గురువారం హాజరయ్యారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. తక్షణమే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లను అరికట్టాలి

నరసన్నపేట: జిల్లాలో ఆన్‌లైన్ బెట్టింగ్‌లను అరికట్టాలని అఖిలభారత యువజన సమాఖ్య డిమాండ్ చేసింది. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐపిఎల్ మొదలు నుంచి విచ్చలవిడిగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లు సాగుతున్నాయని అన్నారు. పట్టణాల్లో యువతను టార్గెట్ చేస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్‌ను ప్రోత్సహిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినా చర్యల్లేవని అన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నివారించాలని ఎస్‌పిని ఇదివరకే కోరామని తెలిపారు. సమావేశంలో రాము, సాంబశివరావు, శ్యామ్, సాయి పాల్గొన్నారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు



వివరాలను వెల్లడిస్తున్న అప్పన్న

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని గ్రామాల్లో వచ్చే వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందుస్తు చర్యలు చేపట్టాలని ఎంపిపి లుట్ట అమ్మజమ్మ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి అధ్యక్షతన గురువారం మండల సమావేశం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ బూరాడ శివబాబు మాట్లాడుతూ గ్రామీణ తాగునీటి, జెజెఎం పథకాల ద్వారా మండలానికి 144 పనులకు గాను, రూ.44 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. దీనిద్వారా తాగునీటి కుళాయిలు, ట్యాంకులు, కాలువలు పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. రణస్థలం సిడిపిఒ ఝాన్సీ మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకం ద్వారా తల్లి, తండ్రి మృతి చెందిన 18 ఏళ్లలోపు పిల్లలకు నెలకు రూ.4 వేలు చొప్పున కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు.

దీనికి ఈ నెల 15లోగా దరఖాస్తులు చేసుకోవాలనిన్నారు. పిఆర్ ఎఇ లింగాల అప్పన్న మాట్లాడుతూ మండలంలోని అదపాక నుంచి వెంకటాపురం వెళ్లే రహదారికి సిఎం ప్రత్యేక నిధుల ద్వారా రూ.3.12 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. మండలంలో 23 సచివాలయ భవనాలు, 22 రైతు భరోసా కేంద్రాలు, 19 హెల్త్ క్లినిక్‌లు భవన నిర్మాణాలూ 90 శాతం పూర్తయిందన్నారు. వీటికి రూ.2.38 కోట్లు బిల్లులు మంజూరు కావాల్సి ఉందన్నారు. తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టుల ద్వారా ఈ ప్రాంతం రైతులకు కాలువల ద్వారా సాగునీరు అందివ్వడం లేదని సభ్యులు సంబంధిత అధికారులను నిలదీశారు. కాలువలు తవ్వి సంవత్సరాలు గడుస్తున్నా పూడికలు పేరుకుపోయినా కనీసం అధికారులు పట్టించుకొనే పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, ఎంపిడిఒ కె.సురేష్‌కుమార్, వైస్ ఎంపిపి లుకాలపు శ్రీనివాసరావు, వెలుగు ఎపిఎం మావూరి మాధవీలత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోటబొమ్మాళి: మండలంలోని జర్జంగి – చల్లవానిపేట రోడ్డులో రేగులపాడు సమీపంలో గురువారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో గంగుపేటకు చెందిన కొయ్యాన గంగయ్య (53) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... గంగయ్య కుమారుడు మోహనరావు ఇంటి వద్ద తన భార్యతో ఘర్షణపడి చల్లవానిపేట వైపు వెళ్లిపోయాడు. మోహనరావును వెతకడానికి తండ్రి గంగయ్య, గ్రామస్తులు కొర్రాయి కృష్ణారావు, రావుల హరిశ్చంద్రతో కలిసి ఆటోలో బయలుదేరి వెళ్లారు. చల్లవానిపేట కూడలిలో ఉన్న తన కుమారుడు మోహనరావును బతిమిలాడి తన ఆటోలో ఎక్కించుకొని ఇంటికి తీసుకెళ్తున్నాడు. ఆటోకు ఎదురుగా వస్తున్న మరో వాహనం లైటింగ్ కళ్లపై పడడంతో డ్రైవర్ తడబాటుకు గురయ్యారు. వెంటనే ఆటో రోడ్డుపక్కన ఉన్న చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగయ్య ఆటోలోనుంచి కిందకు తుళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. కృష్ణారావు, మోహనరావు, హరిశ్చంద్రలు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మైనింగ్ అధికారుల దాడులు

పొందూరు: మండలంలో లోలుగు ఎస్‌సి కాలనీ సమీపంలోని చెరువులో ఆక్రమార్కులు అక్రమంగా మట్టి తవ్వుతున్నారు. సమాచారం అందుకున్న మైనింగ్, విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు చేశారు. ఈ దాడిలో ప్రొక్లెయినర్, ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా రాళ్లు, మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో మైనింగ్ డిడి ఫణిభూషణ్‌రెడ్డి, ఎడి బాలాజీనాయక్, విజిలెన్స్ ఎడి వెంకటేశ్వర్లు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వరరావు, నాగరాజులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

స్పీకర్ శవ రాజకీయాలు చేస్తున్నారు

ప్రజాశక్తి- పొందూరు

అక్రమ గ్రావెల్ క్వారీలో సంభవించిన ప్రమాదంలో యువకుడు మృతి చెందితే... పక్కనే ఉన్న క్రషర్‌కు అంటగడుతూ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం శవరాజకీయాలు చేస్తున్నారని టిడిపి మండల నాయకులు విమర్శించారు. మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రమాదంలోనే యువకుడు మృతి చెందడం వాస్తవమని, దానిని హత్య అంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. క్రషర్ లైసెన్స్‌కు అనుమతులు పొందడం... అక్రమంగా లా పట్టా పొందినంత సులభం కాదంటూ వారు ఎద్దేవా చేశారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు చిగులపల్లి రామ్మోహన్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర భాస్కర్, ఎఎంసి మాజీ చైర్మన్ అన్నెపు రాము, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వండాన మురళి, ఎంపిటిసి మాజీ సభ్యులు కె.శ్రీనివాసరావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

బాధితులకు దుస్తుల పంపిణీ

లావేరు : మండలంలోని ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదం సతివాడ ఆదినారాయణ, సీల చినరాము, అదపాక సత్యం, అదపాక తవుడు, సీల తవుడు, దేవాడ రాముకు చెందిన పూరిళ్లు మంటల్లో దగ్ధమయ్యాయి. తిండి గింజలతో సహా సామగ్రి మొత్తం దగ్ధం కావడంతో కట్టుబట్టలతో మిగిలిపోయారు. ఈ విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ గురువారం బాధితులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుని ప్రభుత్వం పరంగా అన్నివిధాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఆర్థికసాయం, దుస్తులను, దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతు ఎల్లంనాయుడు, వావిల్ల రామారావు, వాలంటీర్ పుష్పారావు, జొన్నాడ సురేష్, గేదెల అనీల్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



దుస్తులను అందజేస్తున్న సాయికుమార్

పకడ్బందీగా గ్రామదేవత సంబరాలు



ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కమిటీ సభ్యులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పకడ్బందీగా గ్రామదేవత సంబరాలు నిర్వహిస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ స్పష్టం చేసింది. గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి అధ్యక్షతన అభివృద్ధి కమిటీ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ గురుప్రసాద్, ఎస్ఐ గోవిందరావు, కమిషనరు రమేష్, సిహెచ్‌సి వైద్యుడు దేవేంద్రరెడ్డి, విద్యుత్‌శాఖ ఎఇ గోవిందరావు, అగ్నిమాపకశాఖ అధికారులు సంబరాల నిర్వాహణపై పలు సూచనలు చేశారు. విద్యుత్ సమస్య తలెత్తకుండా అధికారులు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి సూచించారు. గట్టి బందోబస్తు నిర్వహించాలని పోలీసుశాఖను కోరారు. అభివృద్ధి కమిటీ అధికార యంత్రాంగానికి పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. తాగునీటి సరఫరా, పబ్లిక్ టాయిలెట్స్, పారిశుధ్య కార్మికులు అదనంగా ఏర్పాటు చేసినట్లు కమిషనరు రమేష్ తెలిపారు. సమావేశంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, వార్డు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమ పరవళ్లు



ఆమదాలవలస : సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సంక్షేమ పరవళ్లు గడప గడపలో కొనసాగుతున్నాయని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని 23 వార్డు వెంకయ్యపేటలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నది? లేనిది? అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వాని రెండు కళ్లు అని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీను, మాజీ కౌన్సిలర్ బొడ్డేపల్లి ఏకాశమ్మ, బొడ్డేపల్లి రాజు, మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, తహశీల్దార్ ఎస్.గణపతి, ఎఒ మెట్ట మోహనరావు పాల్గొన్నారు.

లావేరు: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందజేస్తుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మురపాక-2 సచివాలయ పరిధిలోని చల్లయ్యమ్మ అగ్రహారం, పి.బి.నగర్ కాలనీలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో కూడిన పోస్టర్‌ను అందజేశారు. అనంతరం సచివాలయ సిబ్బందితో, వాలంటీర్లతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఏ ఒక్క అర్హుడికీ పథకాలు రాకుండా ఉండే పరిస్థితి ఉండకూడదన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు దన్నాన రాజినాయుడు, సర్పంచ్ పెయ్యల నాగమణి, ఎంపిడిఒ సురేష్ పాల్గొన్నారు.



లావేరు: సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

నందిగాం: మండలంలోని దేవపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గురువారం మధ్యాహ్నం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని అన్నారు. ఇంకా ఎవరైనా మిగిలి ఉన్నారా అన్నది తెలుసుకునేందుకు గడప గడపకు వస్తున్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో జగనన్న సచివాలయ కన్వీనర్ల మండల అధ్యక్షులు జె.జయరాం, సర్పంచ్ ఎర్ర విశ్వశాంతి, వైసిపి నాయకులు ఎర్ర చక్రవర్తి, మాదిన గోపాలకృష్ణ, బాలక మధుసూదనరావు, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడ ఏర్పాటుతో పలాస అభివృద్ధి

పిసిఎంఎ అధ్యక్షులు సురేష్‌బాబు

ప్రజాశక్తి- పలాస

పలాస మండలం రామకృష్ణాపురం వద్ద రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కృషితో 60 ఎకరాల్లో ఏర్పాటు కానున్న పారిశ్రామిక వాడ వల్ల పలాస-కాశీబుగ్గ ఎంతో అభివృద్ధి చెందుతుందని, యువకులు పారిశ్రామిక రంగంవైపు వచ్చే అవకాశాలు ఉన్నాయని పిసిఎంఎ అధ్యక్షులు మాల్లా సురేష్‌బాబు, పారిశ్రామిక వాడ జీడీ పరిశ్రమల సంఘం మల్లా రామేశ్వరం అన్నారు. గురువారం ప్రగతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జీడి పరిశ్రమ అభివృద్ధిపై గత ప్రభుత్వం ఎటువంటి సహాయ సహకారాలు అందించలేదని, తిత్లీ తుపాను సమయంలో ప్రభుత్వం దృష్టిసారించకపోవడం, జీడి ఉత్పత్తుదారులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. కొత్తగా ఏర్పడుతున్న పారిశ్రామిక వాడ వల్ల రైతులకు జీడి మద్దతుధర, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, కార్మికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఆ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పడితే ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 15వేల మంది కార్మికులకు ఉపాధి దొరకుతుందన్నారు. 1971 ఏర్పడిన జీడి కార్మిక సంఘం ఇప్పటివరకు యాథావిధిగా కొనసాగుతున్నా ప్రతి ఏడాది కార్మికులు, యాజమాన్యాల మధ్య చర్చలు జరుగుతుండడంతో పరిశ్రమలు మూత పడే పరిస్థితులు ఉండేవని, అయితే అప్పలరాజు చొరవ వల్ల అలాంటి పరిస్థితి పునరావృతం కాలేదని అన్నారు. పారిశ్రామిక వాడ ఏర్పాటుకు కృషి చేసిన సిఎం, మంత్రి అప్పలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎఎంసి చైర్మన్ పి.వి.సతీష్, పట్టణ వైసిపి అధ్యక్షులు సనపల సింహాచలం, పిసిఎంఎ కార్యదర్శి శివకృష్ణ, కోశాధికారి పట్నాన రవికాంత్, కార్యదర్శి తూముల శ్రీనివాస్, శాసనపురి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిసిఎంఎ అధ్యక్షులు సురేష్‌బాబు

సబ్ పోస్టాఫీసు విలీనం ఆపాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

40ఏళ్లుగా ఇచ్ఛాపురంలో సేవలు అందిస్తున్న బస్టాండ్ పోస్ట్ ఆఫీస్ గురువారం సబ్ పోస్టాఫీసులో విలీనం చేయడం చాలా బాధాకరమని, అలా జరగకుండా చూడాలని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్‌కి రిజిస్టర్ పోస్టులో వినతిపత్రం ద్వారా ఎలియన్స్ క్లబ్ విన్నవించింది. క్లబ్ అధ్యక్షుల లోపింటి నరసింహమూర్తి మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా శాఖలు విస్తరించాల్సింది పోయి, ఉన్న వాటిని కుదించడం చాలా బాధాకరమని అన్నారు. ప్రజలు దూర ప్రాంతంలో ఉన్న సబ్ పోస్టాఫీసుకి వెళ్లి సేవలు పొందటం కష్టతరమని దానంపేట, కార్జీవీధి, గొల్ల వీధి ఆకులవీధి, గోర్జివీధి వారికి సేవలు అందుబాటులో లేకుండా పోతాయని తెలిపారు. కార్యక్రమంలో సెక్రెటరీ తిప్పన లక్ష్మణరెడ్డి, పిఆర్ఒ దక్కత గోపీనాథ్, ఉమాశంకర్, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

'రవితేజ'లో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని మురపాకలో రవితేజ స్కూల్ యాజమాన్యం పి.వేణుగోపాలరావు, చిన్నారావు మాస్టర్స్ ఆధ్వర్యాన గురువారం ఘనంగా ఫేర్వెల్ నిర్వహించారు. ఈ మేరకు చిన్నారులు సినీ పాటకు డాన్సులు చేశారు. పాటలతో అందరినీ అలరించారు. అలాగే స్కూల్ నుంచి బయటకి వెళ్లి ఎన్నో విజయాలు సాధించిన విద్యార్థులకు మెడల్స్‌ను అందించారు. కార్యక్రమంలో ఎంఆర్‌సి గోవిందరావు, విజయవాడ ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు, వి.సన్యాసినాయుడు, పి.ఉషారాణి పాల్గొన్నారు.



మెడల్స్‌ను అందుకున్న విద్యార్థులు

'పది' పరీక్షా కేంద్రాలు పరిశీలన

పలాస: పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో కాశీబుగ్గ, పలాస, చినబాడాం, ఎస్ఎఫ్ఎస్ పాఠశాలల్లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షా కేంద్రాలను గురువారం పదో తరగతి పరీక్షా కేంద్రాల రాష్ట్ర పరిశీలకులు విజయ భాస్కరరెడ్డి పరిశీలించారు. ప్రతి కేంద్రంలోనూ రెండు గదులను పరిశీలించారు. మౌలిక సదుపాయాల ఏర్పాటును పరిశీలించారు. మండలంలో 1469 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 1455 మంది పరీక్షలు రాశారని తెలిపారు. ఎంఇఒ సిహెచ్ శ్రీనివాసరావు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ పోతనపల్లి బాలరాజులు ఉన్నారు.

అన్నదానానికి విరాళం

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన మల్లాది విజయలక్ష్మి రూ.1,00,116 విరాళంగా అందజేశారు. గురువారం ఆలయాన్ని సందర్శించిన ఆమె ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మను కలిసి చెక్కును అందజేశారు. యాత్రికులకు నిత్యం అమలవుతున్న అన్నదానానికి ఉపయోగించాలన్నారు.

పలుచోట్ల చలివేంద్రాలు ప్రారంభం



మెళియాపుట్టి : మజ్జిగను అందజేస్తున్న ఎస్ఐ రాజేష్

కవిటి: మండలంలోని బొరివంక బస్టాండ్‌లో గురువారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ బెందాళం శ్రీరామ్ ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో భగీరథి దొలై, బెందాళం విజయ్ కృష్ణ, బల్లెడ జయప్రకాష్, అంతర్యామి, కాళీ సాహు, ఆముదాల భాస్కర్, జగదీష్, దుద్ది విజయ్, తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మాలపేట కనకదుర్గమ్మ ఆటో యూనియన్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ టి.రాజేష్, పిహెచ్‌సి వైద్యులు గ్రీష్మ, అలేఖ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ చలివేంద్రం ప్రజల దాహార్తి తీర్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు బసవ సంతోష్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షులు కర్రి రాము, కమిటీ సభ్యులు సుగ్గు లక్ష్మీకాంతరెడ్డి, తేజ పాల్గొన్నారు.

జి.సిగడాం : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే వాండ్రంగిలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ సాకేటి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా మండల నాయకులు బురాడ వెంకటరమణ మాట్లాడుతూ ఈ వేసవి కాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని చలివేంద్రాలు ఏర్పాటు చేయడం మంచి కార్యక్రమమని అన్నారు. బుడారి లక్ష్మణరావు, కర్రి వైకుంఠరావు, కార్యదర్శి వడిశ గౌరీశంకర్ పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు ప్రారంభం



సంతబొమ్మాళి : మస్టర్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి- బూర్జ

జాబ్‌కార్డుదారులందరికీ వంద రోజులు ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎంపిపి కె.దీప సూచించారు. మండలంలో లక్కుపరంలో ఉపాధి హామీ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలస కూలీలను నివారించేందుకు ప్రభుత్వం ఉపాధి పనులు చేపడుతుందని తెలిపారు. మస్తరు ప్రకారం పనులు చేపట్టి కనీస కూలి వచ్చేలా పనులు చేపట్టాలన్నారు. వ్యవసాయం, గృహ, ఆర్టికల్చర్ వంటి పనులు చేర్చించి ఉపాధి కూలీలకు పనులు కల్పిస్తున్నామని అన్నారు. దీంతో రైతులకు మేలు చేకూరుతుందన్నారు. డిసిఎంఎస్ మెంబరు జల్లు బలరాంనాయుడు, కె.వాసుదేవరావు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా వలసలు నివారించవచ్చని మేఘవరం సర్పంచ్ ప్రతినిధి పరపటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం సూరాడవానిపేట, పాత మేఘవరం గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ సూరాడ జోగారావు, మాజీ సర్పంచ్ వంక సోమేశ్వరరావు, గ్రామ పిళ్ల బైపల్లి పున్నయ్య, సిరిగిడి రాము, చిదపాన శంకర్‌రెడ్డి, కంబాల వెంకటస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ సూరాడ శ్రీదేవి పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని బెంకిలి పంచాయతీలో గురువారం ఎంపిపి ఎన్.దాసు ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు పనులను దుర్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పిరియా ధర్మేంద్ర, టి.శేఖర్, టి.షణ్ముఖరావు, కె.రాజు, ఎం.వాసు, ఎస్.జానీ, అజయ్, కుమారి పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజ్యలక్ష్మి



ఆమదాలవలస : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీరామ్మూర్తి



పొందూరు : మాట్లాడుతున్న వైసిపి నాయకులు

'మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మా నమ్మకం నువ్వే అన్నది ప్రజల నినాదమని వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మా నమ్మకం నువ్వే జగన్ అన్న పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 20 వరకు మండలంలో మా నమ్మకం నువ్వే జగన్ పేరిట భారీ ఎత్తున ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి గ్రామాల్లో ప్రచారం చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలోని 19 సచివాలయ పరిధిలో 30 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, ఆయా గ్రామాల్లో జెడ్‌పిటిసి, మండల సచివాలయ కన్వీనర్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వాలంటీర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లాలన్నారు. గత ప్రభుత్వ పాలన, ఈ ప్రభుత్వ పాలనకు ఉన్న తేడాను ప్రజలకు వివరించాలని తెలిపారు. జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మండల సచివాలయ కో-ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్, మొండేటి కుర్మారావు పాల్గొన్నారు.

పొందూరు : గ్రామాల్లో ఈ నెల 7 నుంచి చేపట్టనున్న 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్‌లు కోరారు. మండలంలోని కృష్ణాపురంలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్ కుమార్, ఎంపిటిసి కొన్న రమణ, మాజీ సర్పంచ్ గార రమణ, పట్టణ అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: జగనన్న భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఇంటికీ అందుతున్న పథకాల గురించి వివరిస్తూ, జగనన్నే మా భవిష్యత్' పేరుతో ప్రచారాన్ని శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్‌లు భారతీ దివ్య, లాభాల స్వర్ణమణి, సాలీనా ఢిల్లీ, చైర్మన్ తాడి ఆదిరెడ్డి, ప్రత్తి అన్వేష్, జగన్, ప్రదీప్, మధుమూర్తి, తేజా, ప్రేమకుమార్, నీలపు ఢిల్లీ, టెంక లోకేష్, ప్రకాశరావు పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.



సర్వే ప్రక్రియనును పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి యశోద

భూ సర్వే పరిశీలన

సోంపేట: మండలంలోని పలాసపురం పంచాయతీలో జరుగుతున్న భూ సర్వే ప్రక్రియను జెడ్‌పిటిసి తడక యశోద, సర్పంచ్ జోగారావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది వేయిస్తున్న సర్వే రాళ్లను పరిశీలించారు. దీని వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జెడ్‌పిటిసి అన్నారు. కార్యక్రమంలో రైతులు డి.మోహన్‌రావు, డి.శంకర్, డి.కుమార్ పాల్గొన్నారు.

విశాఖ వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ప్రగడపుట్టుగ గ్రామానికి చెందిన వాలంటీరు యాంద్రాపు చిరంజీవి విశాఖపట్నంలోని కిడ్నీ రోగికి పింఛను అందించి, సహ వాలంటీర్లకు ఆదర్శంగా నిలిచాడు. గ్రామానికి చెందిన ముత్యాల కృష్ణవేణి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటోంది. కిడ్నీ రోగులకు ప్రభుత్వం అందిస్తున్న రూ.10వేలు పింఛన్‌ను అందించాడు. ఈ సందర్భంగా చిరంజీవిని సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఇఒ వీరభద్రస్వామి, తదితరులు అభినందించారు.

సామాజిక భవనం నిర్మించరూ..

ప్రజాశక్తి- కవిటి

సామాజిక భవనం మంజూరు చేసి, నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని నాయీ బ్రాహ్మణులు ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్‌ను కోరారు. గురువారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర సమావేశాలు, శుభకార్యాలకు ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో సర్పంచులు పూడి లక్ష్మణరావు, లచ్చయ్య, వైసిపి లీగల్‌సెల్ అధ్యక్షుడు పులకల శ్రీరాములు, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, ఎఎంసి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, ఎఎంసి వైస్ చైర్మన్ వై.నీలయ్య, జెసీస్ ప్రెసిడెంట్ యుగంధర్, కో-ఆప్షన్ మెంబర్ పాండవ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయీ బ్రాహ్మణులు

రైతు సహాయక పథకాలపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నైర వ్యవసాయ కళాశాల ఆధ్వర్యాన విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై రైతుల అవగాహన కల్పించేందుకు వీలుగా క్షేత్ర పర్యటనలు చేస్తున్నారని అసోసియేషన్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులకు ఆర్ఎడబ్ల్యు కార్యక్రమంలో భాగంగా క్షేత్ర పర్యటనలు తప్పనిసరన్నారు. ఆ సమయంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు వీలుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

సేంద్రీయ వాడకాన్ని, వాల్యూఎడిషన్ ప్రాధాన్యత వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎడిఆర్ డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల విత్తనాలు పంపిణీ



నవధాన్యాల ఆవశ్యకతను వివరిస్తున్న సింహాచలం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

లక్ష్మీపురం, సవరపేట, చిన్న తుంగాం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో భాగంగా నవధాన్యాల విత్తనాలను రైతులకు ప్రకృతి వ్యవసాయం ఎస్‌డిఎపి సింహాచలం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నవధాన్యాల విత్తనాలతో జీలుగ, పిల్లిపెసర, జనుము, చిరుధాన్యాలు, తృణధాన్యాలు, పప్పు జాతి విత్తనాలు, నూనె జాతి విత్తనాలు ఆకుకూరలు, కాయగూరలు విత్తనాలు మొత్తంగా 12 కేజీలు ఎకరానికి ఇవ్వడం జరుగుతుందని అన్నారు. రైతులు వారికి ఉన్న విస్తీర్ణంలో పై విత్తనాలను పచ్చిరొట్టగా వేసుకోవడం ద్వారా భూసారం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో కె.ఉష, టి.వేనమ్మ, రైతులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట బాలుర గురుకుల పాఠశాల, హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలల్లో గల పదో తరగతి పరీక్షా కేంద్రాలను గురువారం ఐటిడిఎ పిఒ బి.నవ్య పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా పరీక్షలను నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ ఎం, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డిఇఒ తనిఖీ

మండలంలోని బాలికల గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రాన్ని పాలకొండ డిప్యూటీ డిఇఒ స్క్వాడ్ విజయకుమారి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. పరీక్షలు సజీవుగా జరగాలన్నారు అనంతరం మల్లి బాలుర గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

చిన్నారికి గ్రామస్తుల ఆర్థికసాయం

కంచిలి: మండలంలోని శ్రీరాంపురం గ్రామానికి చెందిన బాలుడు లండ యోగేంద్ర కేన్సర్‌తో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఆపరేషన్ కోసం తల్లిదండ్రులు దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో పలు స్వచ్ఛంద సంస్థలు, యువత తమ వంతు సహకారాన్ని అందజేస్తూనే ఉన్నారు. గురువారం సాలిన పుట్టుగ గ్రామానికి చెందిన లయన్స్ గ్రూప్ సభ్యులు, గ్రామస్తులు కలిసి రూ.25,500 బాలుడు తల్లిదండ్రులకు అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన బాలుడి ఆరోగ్యం కోసం దాతలు స్పందిస్తున్న తీరుకు ఆ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.



ఆర్థికసాయం అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మహిళల ఆర్థిక సాధికారతకు 'ఆసరా'

కోటబొమ్మాళి: మహిళల ఆర్థిక సాధికారతకు వైఎస్ఆర్ ఆసరా దోహదపడుతుందని ఎంపిపి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి వెంకటరావు అన్నారు. గురువారం మాసాహెబ్‌పేట పంచాయతీలో సర్పంచ్, కళింగ కర్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు ధనలక్ష్మి, హేమసుందరరాజు ఆధ్వర్యంలో మూడో విడత ఆసరా నమూనా చెక్కు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి మహిళను లక్షధికారి చేయాలని వైఎస్ఆర్ ఆకాంక్ష అని అన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగన్‌కు అండగా ఉండాలన్నారు. అనంతరం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గడ్డవలస నాగభూషణరావు, అన్నెపు రామారావు, పేడాడ వెంకటరావు, రాము, తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న డాక్టర్ రాయ్

వ్యవసాయ ప్రదర్శన ప్రారంభం

కోటబొమ్మాళి: వ్యవసాయంలో రైతులకు ఏవైన సమస్యలు ఉంటే నైర వ్యవసాయ కళాశాలను సంప్రదించాలిన వ్యవసాయ కళాశాల సమన్వయకర్త డాక్టర్ జి.ఎస్.రాయ్ అన్నారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులతో గురువారం మండలంలోగల ఎత్తురాళ్లపాడు గ్రామంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. రైతులకు కాలాన్ని బట్టి పంట నార్లు కెవికెలో అందుబాటులో ఉంటాయని ఉద్యాన పంట శాస్త్రవేత్త హరికుమార్ తెలిపారు. రైతు ఫీడ్‌బ్యాక్ ద్వారా రైతులకు విత్తనాలు అందుబాటులోకి తీసుకువస్తామని మినిమిల్స్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా రైతు అధిక లాభాలు అశించవచ్చునని ఎడిఆర్ పి.వి.కె జగన్నాథరావు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు ఆర్.కె.నేతాజీ, శివప్రసాద్, అనసూయ. నీలవేణి, శ్రీనివాస్, స్థానిక ఏవో ఎస్. గోవిందరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

లావేరు : ప్రతి విద్యార్థీ వేసవి సెలవుల్లో స్థానిక గ్రంథాలయాకి వచ్చి పుస్తకాలు చదువుకుని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. లావేరు శాఖాగ్రంథాలయం ఆధ్వర్యాన స్థానిక సత్యసాయి స్కూల్ విద్యార్థులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలకు ఒంటి పూట స్కూల్ ఇచ్చారని, ఎండ తగ్గిన తర్వాత సాయంత్రం గ్రంథాలయానికి పిల్లల వచ్చి చదువుకోవాలని అన్నారు. అలాగే వేసవి సెలవులనూ వినియోగించుకోవాలన్నారు. అలాగే ప్రతి విద్యార్థీ గ్రంథాలయంలో ధరావతు చెల్లించి పుస్తకాలను ఇళ్లకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్లుపాకను తొలగించాలి



ఆర్‌అండ్‌బి స్థలంలో ఏర్పాటు చేసిన కల్లుపాక

పొందూరు : మండలంలోని కొంచాడ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిలో ప్రభుత్వ పాఠశాల సమీపంలో కల్లుపాక ఏర్పాటు చేయడంపై స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. రైల్వేస్టేషన్ సమీపంలో రాహదారుల, భవనాల శాఖ స్థలంలో అక్రమంగా కల్లు పాకను ఏర్పటు చేసి శాశ్వత కట్టడాన్ని చేపడుతున్నారని తెలిపారు. దీంతో వ్యవసాయ భూములకు, జిరాయితీ భూముల నివాసాలకు వెళ్లే రహదారిని మూసివేస్తున్నారని ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్పందనలో ఫిర్యాదు చేసినా స్పందన లేదని వాపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కల్లుపాకను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.